



స్వామివారి పాదాలను తాకుతున్న సూర్యకిరణాలు

లక్ష్మీనారాయణ స్వామి పాదాలను తాకిన సూర్యకిరణాలు

జైనథ్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే అతి ప్రాచీన ఆలయం అయిన మండల కేంద్రంలో గల శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి పాదాలను సూర్యకిరణాలు తాకాయి. ప్రతి సంవత్సరం ఈ సూర్యకిరణాలు అక్టోబరు, నవంబరు మాసాలతో పాటు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మాసాల్లో సూర్యుడు ఉదయించిన మొదట సూర్యకిరణాలు నేరుగా స్వామి వారి పాదాలను తాకిన తర్వాతే ఇతర వాటి పై పడతాయని స్థానిక భక్తుల ప్రగాఢ నమ్మకం. స్వామి వారి పాదాలపై పడ్డ సూర్యకిరణాలను వీక్షిస్తే అనుకున్న పనులు, కోరికలు నెరవేరుతాయంటున్నారు. ఈ సూర్య కిరణాలను వీక్షించడానికి ఆయా గ్రామాల నుంచి భక్తులు వస్తున్నారు. కాగా, లక్ష్మి నారాయణ స్వామి ఆలయంలో ప్రతీ శుక్రవారం దాతల సహాయంతో అన్నదానం కొనసాగుతోంది.



డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న కలెక్టర్

తాడిహత్నూర్‌లో లైబ్రరీ, డిజిటల్ తరగతుల ప్రారంభం

నార్నూర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో తాడిహత్నూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శుక్రవారం డిజిటల్ క్లాస్ రూమ్, లైబ్రరీని రిబ్బన్ కట్ చేసి కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం శివారులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో నాటిన వివిధ రకాల మొక్కలను పరిశీలించారు. అనంతరం మండలంలోని వివేకానంద స్కూల్ ఎదురుగా ఉన్న ఫంక్షన్ హాల్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఫొటో ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నార్నూర్ మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు (విద్యా, వైద్యం, తదితర రంగాల్లో) హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహాయ సహకారాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం నార్నూర్‌లో భాగంగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బీఏఐఎఫ్ సంస్థ సహకారంతో వివిధ అభివృద్ధి కార్యక్రమంలో డిజిటల్ తరగతి గదులు, గ్రంథాలయాలు, వాడి తోటల ప్రాజెక్ట్, సహ వనరుల నిర్వహణ (ఎన్ఆర్ఎం), సోలార్ కార్యక్రమాలు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ ప్రాంతీయ డైరెక్టర్, బీఏఐఎఫ్ రాష్ట్ర అధికారి పాల్గొని గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా తీసుకున్న ఈ సమగ్ర ప్రాజెక్టును ప్రోత్సహించడం జరిగిందన్నారు. ఆ తర్వాతర గ్రంథాలయాన్ని ప్రారంభించి విద్యార్థులకు పాఠాలను చదివించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు సరిగా చదువుతున్నారా? లేదా? చూడాలని, దగ్గరుండి చదివించి, అర్థం కాని వాటిపై అవగాహన కల్పించాలని అన్నారు. విద్యార్థులు రోజు గ్రంథాలయానికి వచ్చి చదువుకోవాలని, తెలియని విషయాలను తెలుసుకోవాలన్నారు. శివారులో దాదాపు మూడు ఎకరాలకుపైగా ఉన్న చేనులో పండిస్తున్న వివిధ రకాల పండ్లు, కూరగాయలు ఆకుకూరలు వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రీజనల్ మేనేజర్ వెంకటేష్ చల్లవార్, జోనల్ హెడ్ కరుణాకర్ రెడ్డి, సీఎస్ఆర్ టీమ్ ఆసియా సయ్యద్, స్టేట్ హెడ్ హేమంత్, తహసీల్దార్, ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు జిల్లా వైద్యాధికారి

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు : మనోహర్

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, సిబ్బందిలో మార్పు రావాలని, లేకుంటే అలాంటి వారిని సహించేది లేదని అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కుడ్మేత మనోహర్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులకు గైర్హాజరులైన వైద్య అధికారులపై షోకాజ్ నోటీసులు జారీ చేసిన దానిపై వివరణ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. వైద్య సేవలు అందించే విషయంలో మార్పు రాకపోతే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ పూజిత, సీహెచ్ఓ సందీప్, పీహెచ్ఎన్ జ్యోతి, హెల్త్ సూపర్‌వైజర్ పవార్ సురేష్, తదితరులున్నారు.



ఇచ్చోడ మండల పరిధిలో జాతీయ రహదారి పై కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

ఫోర్ లైన్స్.. వన్ వే!

- జిల్లాలో ఏడాది కాలంగా ఇచ్చోడ పరిధిలో బ్రిడ్జి నిర్మాణ పనులు
- బ్లాక్ స్పాట్ల వద్ద భద్రత చర్యలు లేక తరచూ ప్రమాదాలు
- జాతీయ రహదారి వెంట కరువైన సౌకర్యాలు, వసతులు
- నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్న ప్రయాణికులు
- జిల్లావ్యాప్తంగా 11 బ్లాక్ స్పాట్లను గుర్తించిన పోలీసులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫోర్ లైన్స్ రహదారిని నిర్మించినా.. ఇంకా వన్‌వేలోనే ప్రయాణం చేయాల్సి వస్తోందది. తరచూ మరమ్మతుల పేరిట రహదారి మీద ఆంక్షలు విధిస్తూ వాహనాల స్పీడ్‌కు బ్రేకులు వేస్తున్నారు. దీంతో సుదూర ప్రయాణం చేసి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత నెలరోజులుగా కుంభమేళా కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి నిత్యం వేలాది మంది భక్తులు కుంభమేళాకు జిల్లా మీదుగానే వెళ్తున్నారు. దీంతో వాహనాల రద్దీ భారీగా పెరిగింది. గతంలో రోజుకు రెండు వేల వరకు వాహనాలు జిల్లా మీదుగా రాకపోకలు సాగించేవి. ప్రస్తుతం ఈ సంఖ్య పది వేల వరకు పెరిగి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సకల వసతులను కల్పిస్తున్నామంటూ ముక్కుపిండి మరీ టోల్ చార్జీలను వసూలు చేస్తున్నారు. కానీ అధికారులు ఆ స్థాయిలో సేవలు అందించడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని కలుపుతూ వెళ్తున్న అతిపెద్ద 44వ జాతీయ రహదారి జిల్లాలో సుమారుగా 85 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. నేరడిగొండ మండలం ఆరేపల్లి నుంచి మొదలైన రహదారి.. జైనథ్ మండలం డొల్లారా పెన్‌గంగా నది వద్ద ముగుస్తుంది. అయితే 85కిలోమీటర్ల పరిధిలోనే రెండు చోట్ల నేరడిగొండ మండలం రోల్‌మామడ, జైనథ్ మండలం పిప్పర్‌వాడ గ్రామాల వద్ద టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేసి టోల్ ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇందులో మాత్రం తేడాలు రానివ్వని నేషనల్ హైవే అథారిటీ అధికారులు రహదారి మరమ్మతులు, భద్రత చర్యలు చేపట్టడంలో అడుగడుగునా నిర్లక్ష్యమే చూపుతున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సబ్ కాంట్రాక్టర్లకు అప్పగింత

44వ జాతీయ రహదారి పనులను దక్కించుకున్న కాంట్రాక్ట్ కంపెనీలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత కూడా కొన్నేళ్ల పాటు నిర్వహణ బాధ్యత సంబంధిత కంపెనీల పైననే ఉంటుంది. అయితే ఎలాంటి అనుభవం లేని సబ్ కాంట్రాక్టర్లకు పనులను అప్పగిస్తూ చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. మరమ్మతులు బీటీ రెన్యూవల్ అప్రోచ్ సర్వీస్ రోడ్ల పనులను సబ్ కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నట్లు తెలుస్తుంది. ఇలాంటి పరిస్థితుల తో తరచూ రహదారి పనులు దెబ్బతినడంతో మరమ్మతులు చేయాల్సి వస్తుం ది. అలాగే నెలల తరబడి పనులను నిర్వహించడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత యేడాది క్రితం ఇచ్చోడ మండల పరిధిలో దుబార్‌పేట్ వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించినా.. ఇప్పటి వరకు పూర్తి కావడం లేదు. ఇప్పటికే ఓవైపు పనులను పూర్తి చేసినా.. మరోవైపు రహదారిని తవ్వి పనులు చేపట్టడంతో వన్‌వే కష్టాలు ఎదురవుతున్నాయి. గతంలో జిల్లా పోలీసులు సంబంధిత కాంట్రాక్టర్‌ను హెచ్చరించినా.. పరిస్థితుల్లో మార్పు కనిపించడం లేదు. కొందరు నేతల మద్దతు, అండదండలతోనే సంబంధిత కాంట్రాక్టు కంపెనీలు పనులను వేగవంతంగా చేయడం లేదంటున్నారు. జాతీయ రహదారిపై ఏదైనా సమస్య తలెత్తితే గంటల వ్యవధిలోనే పరిష్కరించి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి. కానీ అడిగేవారే లేరన్నట్లుగా రోడ్డు నిర్మాణ సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి.

అడుగడుగునా నిర్లక్ష్యమే కనిపిస్తోంది..

: వన్నెల లక్ష్మణ్, ఇచ్చోడ మండలం



దేశంలోనే అతిపెద్ద హైవేగా పేరున్న 44వ జాతీయ రహదారిపై అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యమే కనిపితిస్తోంది. ఇచ్చోడ బైపాస్‌పై జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా మండల కేంద్రాల మీదుగా వెళ్తున్న జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం లేదు. రోడ్డుపై వాహనాల పార్కింగ్ స్థలాలు కూడా లేవు. టోల్ చార్జీలు భారీగా వసూలు చేస్తున్నా.. వసతులు కల్పించడం లేదు. వెంటనే హైవే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

హైవే.. యమ డేంజర్!!

రహదారిపై బ్లాక్ స్పాట్స్ యమ డేంజర్‌గా మారి ప్రయాణికుల ప్రాణాలను తీస్తున్నాయి. ప్రతియేటా పదుల సంఖ్యలో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ముఖ్యంగా జైనథ్, మావల, గుడిహత్నూర్, ఇచ్చోడ, నేరడిగొండ మండలాల పరిధిలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నేరడిగొండ మండలం కుప్టిఘాట్, ఇచ్చోడ మండలం బైపాస్, గుడిహత్నూర్ మండలం మేకలగండి, మావల మండలం ఆదిలాబాద్ బైపాస్, జైనథ్ మండలం పిప్పర్‌వాడ, బోరజ్ చెక్‌పోస్టుల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా.. ఎలాంటి భద్రత, రక్షణ చర్యలను చేపట్టినట్లు కనిపించడం లేదు. కేవలం రహదారిపై అక్కడక్కడ ఇనుప ప్లాస్టిక్ డ్రమ్ములను ఏర్పాటు చేస్తూ వాహనాల వేగానికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేస్తున్నారే తప్ప.. శాశ్వత పరిష్కారాన్ని చూపడం లేదంటున్నారు. రహదారి నిర్మాణంలోనే చాలా చోట్ల లోపాలు ఉన్నాయని గతంలోనే విమర్శలు వచ్చాయి. జిల్లావ్యాప్తంగా 11 బ్లాక్ స్పాట్లను పోలీసులు గుర్తించారు. అయినా ఇప్పటి వరకు లోపాలను సరిదిద్దే ప్రయత్నం కూడా చేయడం లేదు. దీంతో ఏటా రహదారిపై ఎందరో మంది ప్రాణాలు బలవుతున్నాయి. రహదారి ప్రయాణం అంటేనే ప్రయాణికులు జంకుతున్నారు.

మూన్నాళ్ల ముచ్చటేనా?!

హైవేపై కల్పించిన సౌకర్యాలు వసతులు అత్యవసర సేవలు మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. ప్రారంభంలో అరచేతిలో వైకుంఠాన్ని

(తరువాయి 6వ పేజీలో...)

● వన్‌వేపై జరిగిన ప్రమాదంతో నిలిచిపోయిన వాహనాలిలా..



ఈ ఫొటోలో కనిపిస్తున్న దృశ్యం.. ఇచ్చోడ మండలం దుబార్‌పేట్ బైపాస్ రహదారిపై నిలిచిపోయిన వాహనాల ట్రాఫిక్. గత యేడాది కాలంగా ఇక్కడ బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టడంతో ఒకవైపు రోడ్డును పూర్తిగా బ్లాక్ చేసి వన్‌వేపై వాహనాలకు అనుమతించారు. ఇటీవల ఓ భారీ కంటైనర్ ముందున్న వాహనాన్ని ఢీకొట్టడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేసే వారంతా గంటల తరబడి రహదారి పైనే పడిగాపులు గాయాల్సి వచ్చింది. ఇలా తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నా.. హైవే అథారిటీ అధికారులకు మాత్రం ఉలుకు పలుకు లేదంటున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

● జిల్లా పరిశ్రమల అధికారి నాగభూషణం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా పరిశ్రమల అధికారి నాగభూషణం సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా జన్ శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లోని టీటీడీలో మహిళలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు పొదుపు తీరు, పథకాల ప్రయోజనాలపై తదితరాంశాలపై అవగాహన కల్పించారు. ఎల్‌డీఎం ఉత్పల్ కుమార్, జేఎస్ఎస్ చైర్మన్ సురేందర్ ఉన్నారు.

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఆర్బీఐ వారి ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పొదుపు, సైబర్ ఆర్థిక నేరాల గురించి అవగాహన కల్పించారు. ఇందులో ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగం, వైస్ ప్రిన్సిపల్ గణపతి ఉన్నారు.

● ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన

ఉట్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పూర్ణనందు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.కృష్ణ విద్యార్థులకు పొదుపు ఆర్థిక సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చేరాల లక్ష్మణ్, అధ్యాపకులు శ్రీలత, గణేష్, తిరుపతి, సుజాత, నవీన్, శివప్రసాద్, అధిక సంఖ్యలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో మాట్లాడుతున్న అధ్యాపకుడు ఎస్.కృష్ణ

నిరుద్యోగులకు ప్రభుత్వం చేయూతనందించాలి

● రౌండ్ టేబుల్ సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఖానాపూర్ నియోజక వర్గంలోని షెడ్యూల్ ప్రాంతాల్లో ఎస్సీ ఎస్టీ నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఖానాపూర్ నియోజక వర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జుపటేల్ , రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి వర్యులు దుద్దిల్ల శ్రీధర్‌బాబును కోరారు. శుక్రవారం మంత్రి అధ్యక్షతన హైదరాబాద్‌లోని జేఎస్ కృష్ణమూర్తి హాల్‌లో ఎంఎస్ఎంఈ పాలసీపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా అత్యంత వెనుకబడిన ప్రాంతమని, ముఖ్యంగా ఖానాపూర్ నియోజక వర్గంలో ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాలు పూర్తిగా షెడ్యూల్ ప్రాంతాలని, ఇందులో అనేక మంది ఉన్నత చదువులు చదువుకొని నిరుద్యోగులుగా ఉన్నారని, వారికి మొదటి ప్రాధాన్యత కల్పిస్తూ కుటిర, చిన్న తరహా పరిశ్రమలను నెలకొల్పి ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. తోటి, కోలాం తెగకు చెందిన ఆదివాసీలు వెదురుతో అనేక రకాల నిత్యావసర పనిముట్లు తయారు చేస్తారన్నారు. అటవి శాఖ ద్వాఆర కొంత వెసులుబాటు కల్పించి వారికి ఉపాధి మార్గాలను చూపెట్టాలన్నారు. ఐటీడీఏ ద్వారా నెలకొల్పిన పలు కుటిర, చిన్న తరహా పరిశ్రమలు ఉపయోగంలో లేవని వాటిని ప్రారంభించడానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని పటిష్ఠ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వారితో ఎమ్మెల్యేలు, అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ఖానాపూర్ ఎమ్మెల్యే

● పోచమ్మ ఆలయాభివృద్ధికి కృషి చేస్తా

ఉట్నూర్: మండలంలోని లక్కారం గ్రామ సమీపంలోని పోచమ్మ ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండలంలోని లక్కారం గ్రామ సమీపంలోని పోచమ్మ ఆలయాన్ని సందర్శించి గ్రామస్థులతో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆలయంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆలయంలో తాగునీటి కోసం బోర్‌బావి వేస్తామని, రేకుల షెడ్డు ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య పాఠశాలపై ప్రదర్శన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందంలోని కళాకారులు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య పాఠశాలపై జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాతా బృందం సభ్యులు శుక్రవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు చాహకటి రవీందర్, ఆత్రం గోవిందరావు, గట్టు వెంకట్రావు, రాథోడ్ శంకర్, మెస్రం మురళి, గోడం ఆశిష్, కుమ్ర నగేష్, రాజలింగు, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.



నాగాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీవీటీజీ ఏపీవో

కంది పంట కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఉట్నూర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ సంస్థ వారి ఆధ్వర్యంలో ప్రజామిత్ర రైతు సమాఖ్య ద్వారా శ్యామ్‌పూర్, నాగాపూర్‌లోని సహకార దాల్ మిల్లులో కంది పంట కొనుగోలు కేంద్రాన్ని ఐటీడీఏ పీవీటీజీ ఏపీవో మేస్రం మనోహర్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ యేడు కందులకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు మద్దతు ధర రూ.7,550 ప్రకటించిందని, ఆ ప్రకారం రైతులు అమ్ముకోవాలన్నారు. ప్రైవేట్, ఇతర దళారులకు అమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు. రైతులు తమ సొంత భూమి పట్టాపాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లు తీసుకు రావాలని సూచించా రు. ఈ కార్యక్రమంలో సీసీడీ ప్రాజెక్టు మేనేజర్ కుమ్ర విఠల్‌రావు, రాథోడ్ శేషరావు, పేసా కోఆర్డినేటర్ అర్క వసంత్‌రావు, పాలకవర్గ సభ్యులు సిడాం నాగోరావు, రైతులు మేస్రం మాణిక్‌రావు, జగ్గారావు ప్రశాంత్, అస్రాం, సీసీడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల పాఠశాలకు ప్రవేశాలు

ఉట్నూర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమయ్యాయని స్థానిక మైనార్టీ పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదవ తరగతిలో 40 సీట్లకు గాను 30 సీట్లు మైనార్టీ విద్యార్థులకు, ఐదు బీసీలకు, అలాగే ఎస్సీ, ఎస్టీలకు రెండు వంతున, ఓసీలకు ఒకటి కేటాయించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు అన్నారు. మైనార్టీ విద్యార్థులకు మొదటి దరఖాస్తు వారీగా, నాన్ మైనార్టీలకు లక్కీడిప్ ద్వారా ఎంపిక చేస్తామని, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు భోజన, వసతి సౌకర్యం ఉంటుందని అన్నారు. అన్ని రకాల వసతులు ఉచితంగా లభిస్తాయని, అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నేరుగా పాఠశాలకు వచ్చిన వారికి సైతం నేరుగా దరఖాస్తు చేస్తామన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెం.7995057873, 9908529525 ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు.



ఎస్సై దంపతులను సన్మానిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం

ఉద్యోగ విరమణ పొందిన ఎస్సైకి సన్మానం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఉంటూ.. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ గడపాలని ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. దాదాపు 42 సంవత్సరాలు సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన భీంపూర్ ఎస్సై మొహమ్మద్ కలీమ్‌ను కుటుంబ సభ్యుల సమక్షంలో శుక్రవారం శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఎలాంటి రిమార్కులు లేకుండా సర్వీసును పూర్తి చేసి ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమని ఎస్పీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సురేందర్ రావు, డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐ సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాలనీ వాసులు

నేరడిగొండ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ వాసులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను సాబ్లే సంతోష్‌సింగ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి పలు సమస్యలను విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే కాలనీలో పర్యటించి సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో తిరుపతి, అమర్ సింగ్, రమణ, దేవిదాస్, రాజు, సాయి, తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తలమడుగు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): చట్టలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి భోనగిరి సౌజన్య అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా తలమడుగు మండలంలోని లింగి కస్తూర్బా గాంధీ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భోనగిరి సౌజన్య హాజరై ప్రసంగించారు. అంతకుముందు భోజన వసతి, తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థినులు అతిథులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ ప్రతీ ఒక్క విద్యార్థిని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళా విద్యార్థినులు 18 సంవత్సరాలు నిండి ఉంటేనే వివాహానికి అర్హులు అవుతారని, అంతకన్నా తక్కువ వయసు ఉన్న మీ చుట్టుపక్కల వారికి ఎవరైనా వివాహం చేయడానికి చూస్తే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని, ఉచిత విద్య వైద్యం లాగానే ఉచిత న్యాయం అందించడానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పని చేస్తోందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

● పలుచోట్ల ఆకట్టుకున్న విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శనలు ● తిలకించిన మండల అధికారులు, ఉపాధ్యాయులు



బోథ్‌లో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎంఈవో



సోనాలలో విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

ఉట్నూర్, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జంతుశాస్త్ర, వృక్షశాస్త్ర, రాసయన శాస్త్ర, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, ఇస్రో విజయాల పై వ్యాసరచన, క్యాన్సర్ మహమామ్మారిపై పోస్టర్ తయారీ ప్రదర్శన పోటీలను నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్‌సింగ్, అధ్యాపకులు మాట్లాడుతు నేటి విద్యార్థులు సర్‌సివీ రామన్‌ను ఆదర్శంగా తీసుకొని ఏదైనా విషయంపై ఎందుకు? ఏమిటి? ఎలా? అనే కోణంలో శాస్త్రీయ ధృక్పథంను పెంపొందించుకొని నేటి ప్రపంచాన్ని పీడిస్తున్న క్యాన్సర్ మహమ్మారి, ప్లాస్టిక్ కాలుష్యం, ఎయిడ్స్ వ్యాధి మొదలగు సమస్యలకు పరిష్కారాలు కనుగొనే విధంగా మీ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.జిసాయి ప్రసాద్, అధ్యాపకులు డా.ఎం. నర్సింగ్‌రావు, డా.రాణి, పి.డిడా అనిత, ముజీబ్, కరుణాకర్, శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాజశేఖర్, డా.రవీందర్, రాజ్‌కుమార్, డా.కిషన్, తిరుపతి, డా.శ్రీనివాస్, డా.నవీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్: విజ్ఞాన సదస్సులతో విద్యార్థుల మేధస్సుకు మరింత పదును పెట్టినట్లు అవుతుందని మండల విద్యాధికారి హుస్సేన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నాగభూషణం పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ తరచుగా పాఠశాలలో విద్యార్థుల మేధస్సుకు ఉపయోగపడే ప్రయోగాలను చేయించాలన్నారు. ప్రయోగాలతో కూడిన చదువు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషోర్ కుమార్, ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రసాద్, పోశెట్టి, సదానంద్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, సోనాల మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో శుక్రవారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని నేషనల్ సైన్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు వివిధ రకాల వర్కింగ్ మోడల్స్‌ను ప్రదర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ చైతన్య విద్యార్థులకు సైన్స్ డే ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోనీ బరంపూర్ జిల్లా పరిషత్ హై స్కూల్, తలమడుగు జిల్లా పరిషత్ హైస్కూల్, సుంకిడి ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోనీ ఆయా ప్రధానోపాధ్యాయులు సైన్స్ ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో సైన్స్‌పై విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత ప్రధానోపాధ్యాయులు ప్రత్యూష మాట్లాడుతూ సైన్స్ యొక్క ప్రత్యేకతను గురించి వివరించారు. క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఇందులో వై.రామ్‌రెడ్డి, శ్రీనివాస్, బి.గజానన్, పి.సుకుమార్, ఆర్. సుజాత, సి.శ్రీనివాసరెడ్డి, పిడి నాందేవ్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని లఖంపూర్, కుంటాల బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సైన్స్ పరికరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కిట్, డ్యాన్స్, ఉపన్యాస, పాటల పోటీలు నిర్వహించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్‌రావు, జి.అంబరావు, ఉపాధ్యాయులు సైన్స్ ఉపాధ్యాయులు టి.గంగాభవాని, ఆర్ బాబుసింగ్, జి.సౌజన్యలను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ అవార్డు గ్రహిత సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రాములు మాట్లాడుతూ నిత్య జీవితంలో సైన్స్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతీ విద్యార్థి సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.వినోద్ రెడ్డి, కె.శ్రీనివాస్ రెడ్డి, జి.వెంకట్ రాజు, కట్టా వేణు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



● ఇచ్చోడ మండల కేంద్రం సమీపంలో రహదారిపై వన్‌వేలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న వాహనాలు

ఫోర్ లైన్స్.. వన్ వే!

(5వ పేజీ తరువాయి...)

చూపించిన హైవే అథారిటి అధికారులు.. ఆ తర్వాత అవేమీ పట్టించుకోవడమే లేదు. రహదారిపై అక్కడక్కడ బస్సు షెల్టర్‌లను నిర్మించినా.. ఉపయోగంలోకి రావడం లేదు. అవసరం లేని చోట బస్సు షెల్టర్లను నిర్మించారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నా.. అపరిశుభ్రత పరిసరాలతో కంపు కొడుతున్నాయి. ప్రయాణికుల దాహాన్ని తీర్చేందుకు అక్కడక్కడ నీటి ట్యాంకులను ఏర్పాటు చేసినా.. నిరుపయోగంగానే మారాయి. అత్యవసర సేవల కోసం ఏర్పాటు చేసిన టెలిఫోన్ స్తంభాలు ఎక్కడా పని చేయడం లేదు. ఎమర్జెన్సీలో అందాల్సిన సేవలు కూడా అందడం లేదు. అంతేకాకుండా హైవే పెట్రోలింగ్ నామమాత్రంగానే కనిపిస్తోంది. చాలాచోట్ల మరుగుదొడ్ల నిర్వహణ లేకపోవడంతో తాళాలు వేసి వదిలేశారు. ప్రయాణికులు అత్యవసర సమయంలో అవమానకర పరిస్థితుల ను ఎదుర్కొంటున్నారు. కేవలం టోల్ ఫీజు వసూలు పైననే అధికారులు ప్రత్యేకదృష్టిని సారిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. రహదారిపై అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యమే రాజ్యమేలుతోంది. అధికారుల తప్పిదాలపై ఎవరికి ఫిర్యాదు చేయాలనో తెలియక ప్రయాణికులు సతమతమవుతున్నారు.

'తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు'

నేరడిగొండ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం మండల ఎంపీడీవో సమావేశ మందిరంలో తాగునీరు, ఇందిరమ్మ ఇళ్లు, మరుగుదొడ్లకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమైనందున పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్, ఏపీవో వసంత్‌రావు, తదితరులు ఉన్నారు.

మారెమ్మ ఆలయంలో చోరీ

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలోని శివాజీ కూడలిలోని మారెమ్మ ఆలయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. గర్భగుడి తాళాలు పగులగొట్టి హుండీలోని రూ.30 వేల వరకు నగదు చోరీ చేశారు. అమ్మవారి మెడలోని 3 గ్రాముల బంగారు పుస్తెలతాడు, వెండి ముక్కుపుడక దొంగలు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం గమనించిన సిబ్బంది ఆలయ కమిటీ సభ్యులకు సమాచార అందించారు. కమిటీ అధ్యక్షుడు బాదం గంగన్న వన్ టౌన్‌లో ఫిర్యాదు చేయగా.. సీఐ సునీల్ కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

'ధర్మ పోరాట దీక్షను జయప్రదం చేయాలి'

నార్నూర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ దగ్గర 9వ తేదీన టీఎస్ఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ధర్మ పోరాట దీక్ష కార్యక్రమం ఉన్నందున ఉమ్మడి మండలంలోని దళితులు అధికసంఖ్యలో హాజరుకావాలని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి గంగేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలకేంద్రంలో దళిత సంఘ నాయకులతో కలిసి ఆయన దీక్షకు సంబంధించిన పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి గంగేష్ మాట్లాడారు.



మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేష్

మాటలు జాగ్రత్త సోయం : ఎంపీ నగేష్

తలమడుగు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): 'మాటలు జాగ్రత్త సోయం బాపురావు, చనిపోతే గోరి కడతా అనడం సమంజసం కాదు, విలువలతో కూడిన రాజకీయాలు చేయాలి' అని ఎంపీ నగేష్ మాజీ ఎంపీ సోయం బాపు రావుపై మండిపడ్డారు. మండలంలోని దేవాపూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎంపీ బాపురావు బీజేపీ నాయకులపై, కార్యకర్తలపై ఇష్టానుసారంగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. తప్పుచేసి.. చేయలేదు అనడం సిగ్గుచేటు అన్నారు. రాజకీయ జీవితంలో మచ్చ లేకుండా ప్రజాసేవ చేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. తనను ఎవరైనా విమర్శిస్తే సహించేది లేదని ఎంపీ హెచ్చరించారు. ఆయన వెంట రాష్ట్ర కార్యవర్గ కౌన్సిల్ సభ్యుడు గంగాధర రాజు, మండల కన్వీనర్ భువనగిరి స్వామి, జిల్లా నాయకులు కనపర్తి చంద్రకాంత్, బోండ్ల వెంకటస్వామి, మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ శీను, తదితరులున్నారు.

తాంసి: బీజేపీ మండల అధ్యక్షుడిగా వడ్డాది గ్రామానికి చెందిన సిరిగిరి మహేందర్‌ను నియమించాలని ఎంపీ నగేష్‌కు శుక్రవారం పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు వినతిపత్రం అందజేశారురు. మండల కమిటీతో పాటు బూత్ కమిటీలనుఏర్పాటు చేయాలని కోరారు.

బోథ్: మండలంలోని మందబోగుడ గ్రామానికి చెందిన గ్రామస్థులు శుక్రవారం ఎంపీ జి.నగేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎంపీ దశల వారిగా సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా వారితో పేర్కొన్నారు.

జాతీయస్థాయి

నెట్‌బాల్ క్రీడా పోటీలో ట్రిపుల్ ఐటీ విద్యార్థి



పోటీలకు ఎంపికైన విద్యార్థి వెంకటేష్

బాసర, ఫిబ్రవరి, 28 : (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ విద్యార్థి కే. వెంకటేష్ ఫిబ్రవరి 28 నుండి మార్చి 3 వరకు కలింగ, హర్యానాలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో ఆర్జీయూకేటీ విద్యార్థి వెంకటేష్ ఎంపికకావడం పట్ల వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు. రాష్ట్రం నుంచి ఏడుగురు సభ్యుల్లో ఆర్జీయూకేటీ విద్యార్థి ఉండడంతో ఎంతో గర్వకారమని తెలిపారు. విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు విశ్వవిద్యాలయం తరపున ప్రోత్సహిస్తామని తెలిపారు. విద్యార్థి వెంకటేష్‌ను ఆదర్శంగా తీసుకొని మరిన్ని క్రీడా పోటీల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అభినందించిన వారిలో స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్‌రావు, ఫిజికల్ డైరెక్టర్ శ్యాంబాబు, పీటీలు తదితరులు ఉన్నారు.

వన్యప్రాణిని కాపాడిన గ్రామస్థులు

కడెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిట్యాల వ్యవసాయ బావిలో వన్యప్రాణి చుక్కల దుప్పిపడి బయటకు వెళ్లేందుకు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుండగా అటు వైపుగా వెళ్తున్న గ్రామస్థులు జూపాల్, అనంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి గమనించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. దుప్పిని బావి నుండి బయటకు తీసి అధికారులకు అప్పగించారు. దుప్పిని సమీప అటవీ ప్రాంతంలో వదిలిపెట్టినట్లు ఎఫ్ఆర్‌వో గీతారాణి తెలిపారు.

చిరుత పులుల సంచారం

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంగ్వాపేట్ చెరువు సమీపంలో గురువారం ఉదయం, శుక్రవారం మధ్యాహ్నం రెండు చిరుత పులుల సంచారం స్థానికంగా అలజడి రేపింది. ఈ చిరుత పులుల సంచారంతో రైతులు, గ్రామస్థులు భయాందోళనలో ఉన్నారు. ఈ విషయం గ్రామంలో దండోరా వేయించి గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఈ విషయం తెలుసుకున్న అటవీ అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

విజృంభిస్తున్న చికెన్ పాక్స్

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో 15 మంది విద్యార్థులకు చికెన్ పాక్స్ లక్షణాలు గుర్తించి వైద్యశాఖ అధికారులు విద్యార్థులకు వైద్యం అందించారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్‌వో రాజేందర్ మాట్లాడుతూ... చికెన్ పాక్స్ లక్షణాలతో చర్మంపై మచ్చలు సోకిన విద్యార్థులకు ఐసోలేషన్‌లో ఉంచి వైద్యం అందిస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఒక్కో విద్యార్థికి శరీరంపై రెండు మూడు మచ్చలు ఉన్నట్లు గుర్తించామన్నారు. విద్యార్థులకు చికెన్ పాక్స్ లక్షణాలు ఉన్నట్లు ఏఎన్ఎం అంగూరి సమాచారం అందించడంతో ఆరోగ్య సబ్ సెంటర్ వైద్య బృందం డాక్టర్ ప్రియాంక, సిహెచ్‌వో రాజేశ్వర్, హెల్త్ ఎడ్యుకేటర్ రవీందర్, టెక్నీషియన్ విఘ్నేషలు విద్యార్థులకు వైద్యం అందించామని తెలిపారు.

చికెన్ పాక్స్‌పై ఆందోళన చెందవద్దు

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో చికెన్ పాక్స్ వదంతులు నమ్మవద్దని తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుంక వీణ మాట్లాడుతూ... పాఠశాల, కళాశాలలో చదివే విద్యార్థులు 420 మంది ఉండగా శుక్రవారం 347 మంది విద్యార్థులు వసతి గృహంలో ఉన్నట్లు తెలిపారు.

ప్రజల భద్రత కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్



పట్టుబడ్డ వాహనాలు



మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేష్ మీనా

దస్తురాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సురక్షితమైన భద్రత కల్పించేందుకు, శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగాం అని ఏఎస్పీ రాజేష్ మీనా అన్నారు. మండలంలోని దేవునిగూడెంలో శుక్రవారం గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... వాహనదారులు అందరూ తప్పని సరిగా అన్ని రకాల ధ్రువపత్రాలను కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడప వద్దని వాహనదారులకు సూచించారు. డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. అనంతరం నిర్వహించిన తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 40 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలకు, నెంబర్ ప్లేట్లు లేని 3 ద్విచక్ర వాహనాలకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో సీఐ సైదారావు, ఎస్సైలు శంకర్, కృష్ణసాగర్‌రెడ్డి, రాహుల్ గైక్వాడ్, హనుమంతు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నేషనల్ సైన్స్ డే వేడుకలు



సివి. రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



బాసరలో నాగభూషణ విద్యాలయంలో సైన్స్ ప్రయోగాల ప్రదర్శన

బాసర, ఫిబ్రవరి, 28 : (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా బాసర మండలంలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం వివిధ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. మండలంలోని కిర్గుల్ (బీ) ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు సైన్స్‌కు సంబంధించి వివిధ ప్రయోగాలను ప్రయోగాత్మకంగా చేసి ప్రదర్శించారు. వాటి పనితీరును, ఉపయోగాలను సందర్శకులకు, తోటి విద్యార్థులకు వివరించారు. మండల కేంద్రంలోని నాగభూషణం విద్యాలయంలో జాతీయసైన్స్ దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులు తయారు చేసిన పలు ప్రయోగాలు, ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి.

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని విజయ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ సైన్స్ డే వేడుకల సందర్భంగా నోబెల్ గ్రహీత సర్ సివి.రామన్ ఆవిష్కరించిన రామన్ ఎఫెక్ట్ గురించి తెలియజేస్తూ, సివి. రామన్ భారతదేశ మొట్టమొదటి విద్యావేత్తగా, అతి తక్కువ ఖర్చుతో రామన్ ఎఫెక్ట్ డిస్కవరీ ఫిబ్రవరి 28న 1928 సంవత్సరంలో చేయడం జరిగింది. కావునా ఈ రోజు నేషనల్ సైన్స్ డే గా జరుపుకోవడం జరుగుతుంది. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ఆటపాటలు, ఉపన్యాసాలు సైన్స్ పైన అవగాహన కల్పించేలా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం మాట్లాడుతూ... సివి. రామన్ ఆవిష్కరణ గురించి తెలియజేస్తూ అతను జాతికి చేసిన సేవల గురించి కొనియాడుతూ... రిఫ్లెక్షన్, రి ఫ్రాక్షన్, అబ్జార్షన్ గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొ న్నారు.

చైతన్య టెక్నో స్కూల్‌లో సైన్స్ డే నిర్వహణ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం కొండాపూర్, ఆదర్శనగర్‌లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో శుక్రవారం సైన్స్ డే నిర్వహించారు. ఎంఈవో నాగేశ్వర్‌రావు, సైన్స్ అధికారి వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై సైన్స్ ఫెయిర్ తిలకించి విద్యార్థులను ప్రశంసించారు. పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ విద్య, కోఆర్డినేటర్ మహిపాల్ రెడ్డి, ప్రధానోపాధాయయులు జగతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముథోల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అక్షర ఉన్నత పాఠశాల, రబింద్ర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల, శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని ఫ్యూచర్ కాన్సెప్ట్ స్కూల్, శ్రీవిద్యా, భాష్యంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్షర, శిశుమందిర్, గురుకుల పాఠశాలలో విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలు నిర్వహించారు. సర్ సివి. రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతిని వెలిగించారు. జాతీయ విజ్ఞాన దినోత్సవం గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అనేక విజ్ఞాన ప్రయోగాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్, సుభాష్, సారతి రాజు, ప్రవీణ్, మాధవ్ రావు, ఆనంద్, కరస్పాండెంట్ రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

కుంటాల, ఫిబ్రవరి, 28 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక శాంతినికేతన్ పాఠశాలతో పాటు కల్లూరు వాసవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీవీ రామన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఇట్టి కార్యక్రమంలో విద్యార్థులు పలు రకాల సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పట్ల మక్కువ పెంచుకోవాలని పేర్కొన్నారు. సైన్స్ లేకుంటే మనిషికి ఆనందం లేదని సైన్స్ పురోగతి వల్లనే మానవుడు అవని నుండి అంతరిక్షం వరకు ఎదిగాడని ప్రిన్సిపల్‌లు బోయ సాయిలు, కొత్తకాపు గంగన్నలు పేర్కొన్నారు.

5వ తేదీ నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు

సీసీ కెమెరా నిఘాలో పరీక్షలు

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈ నెల 5వ తేదీ నుంచి మొదలు కానున్నాయి. సమయం తక్కువగా ఉండడంతో విద్యార్థులు అంతా చదువులో పోటీ పడుతున్నారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. తక్కువ సమయం ఉండడంతో పరీక్షా కేంద్రాల వద్ద వసతులపై అధికారులు దృష్టి సారించారు. సీసీ కెమెరాలు, తాగునీటి వసతి, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇంటర్ పరీక్షల ప్రతి కదలిక సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతున్నాయని, విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుందని, నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. వార్షిక పరీక్షల కోసం జిల్లాలో 23 పరీక్షా కేంద్రాలను కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల విద్యార్థులు అందరూ కలిపి 13,133 మంది విద్యార్థులు ఈసారి పరీక్షలు రాయనున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరంలో 6,571 మంది, ద్వితీయ సంవత్సరంలో 6,562 మంది విద్యార్థులు ఉన్నారు. 23 పరీక్షా కేంద్రాలకు 23 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 23 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను కేటాయించారు. పరీక్షల పర్యవేక్షణ కోసం ముగ్గురు జిల్లా స్థాయి అధికారులను కేటాయించారు. ఇందులో ఒకరు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, సీనియర్ ప్రిన్సిపాల్, సీనియర్ లెక్చరర్ ఉంటారు. ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, ఇద్దరు సిట్టింగ్స్ స్క్వాడ్ బృందాలు నియమించారు.

విద్యార్థుల కోసం హెల్ప్‌డెస్క్...

పరీక్షల సమయంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ఈసారి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. దాని ఫోన్ నెంబర్ 9240205555 ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పని చేస్తుంది. మాస్ కాపీయింగ్ చేయడానికి అవకాశం లేకుండా సీసీ కెమెరాల నిఘా ఉంటుంది. తప్పనిసరిగా విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందు చేరుకోవాలి. నిమిషం నిబంధన అమలులో ఉంది.

పాఠశాలకు మ్యూజిక్ ప్లేయర్ అందజేత

కుంటాల, ఫిబ్రవరి, 28 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి నేడు పదవి విరమణ పొందిన సగ్గం గంగాధర్ తాను పనిచేసిన పాఠశాలపై మక్కువతో శుక్రవారం మ్యూజిక్ ప్లేయర్‌ను పాఠశాలకు విరాళంగా అందజేశారు. దీని విలువ రూ. 15 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. పాఠశాలకు మ్యూజిక్ ప్లేయర్ అందజేయడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు గంగాధర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు చంద్రనాగకాంత్, లక్ష్మణ్, ధర్మాజీ, భోజన్న, లక్ష్మీ, చిన్నారెడ్డి, సాహెబ్ రావు, మారుతి, భూమన్న, తదితరులు ఉన్నారు.

ఓలాలో కుస్తీ పోటీలు

కుంటాల, ఫిబ్రవరి, 28 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓలా గ్రామంలో శుక్రవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. శివరాత్రి తర్వాత మరుసటి రోజు ప్రతియేటా ఈ కుస్తీ పోటీలను నిర్వహిస్తారు. ఈ పోటీలకు మహారాష్ట్ర నుండి అధికసంఖ్యలో మల్లయోధులు హాజరై కుస్తీ పోటీలో తలపడ్డారు. కుస్తీ పోటీలను తిలకించేందుకు మండలం నలుమూలల నుంచి అధికసంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి శివుని ప్రతిమను అందజేసి రూ. 5 వేలను అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

అలరించిన విద్యార్థుల హంగామా

కుంటాల, ఫిబ్రవరి, 28 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూర్ గ్రామంలో గల కస్తుర్బాగాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం పదవ తరగతి విద్యార్థులు 9వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల నృత్యాలు చేశారు.



ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అర్ధాంతరంగా నిలిచిపోయిన సమా వేశ మందిరం

అర్ధాంతరంగా నిలిచిన సమావేశ మందిర నిర్మాణ పనులు

బోథ్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గత ఎనిమిది సంవత్సరాల క్రితం నిర్మించిన సమావేశ మందిరం అర్ధాంతరంగా నిలిచిపోయింది. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండలంలోని ఎంపీటీసీలు సర్పంచ్ల సమక్షంలో జరిగే ఈ సమావేశ మందిరం అర్ధాంతంగా ఆగిపోయింది. అప్పట్లో దాదాపు పది లక్షల రూపాయల నిధులతో నిర్మించ తలపెట్టిన ఈ భవనం నిధులు లేక నిలిచిపోవడం జరిగింది. దీంతో ప్రజా ప్రతినిధులతో కలిసి నిర్వహించే సమావేశాలను రైతు వేదికలో కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం పలు ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు లేక నిర్మాణ పనులు నిధులు మంజూరు అయిన కొనసాగడం లేదు.

● గ్రంథాలయం నిర్మిస్తే బాగుంటుంది

మండల కేంద్రంలోని విద్యార్థులకు యువతకు గ్రంథాలయం భవనం లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు అయితే అర్ధాంతంగా నిలిచి పోయిన ఈ భవనాన్ని పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేసి నిర్మించినట్లయితే విద్యార్థులకు యువకులకు ఉపయోగపడే ఆస్కారం ఉంది. అధికారులు ఈ భవనం పూర్తి చేయించాల్సిన అవసరం ఉంది.

● ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలి

అర్ధాంతంగా నిలిచిపోయిన భవనం నిర్మించేందుకుభవనం ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. భవనం నిర్మిస్తే పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన భవనానికి లేదా ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు గానీ కార్యాలయం ఉపయోగించుకునే వీలుంది. ఈ భవనం నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కాగా ఈ విషయమై ఎంపీడీవో రమేష్‌ను వివరణ కోరగా నిధులు లేకపోవడం వల్ల నిర్మాణం ఆగిపోయిందని నిధులు మంజూరు అయితే భవనం పూర్తి చేయిస్తామన్నారు.

మా గోడు పట్టించుకోండి సారూ..

● పదేళ్ల నుంచి విద్యార్థులకు సేవలందిస్తున్న అతిథి అధ్యాపకులు ● రెగ్యులర్ అధ్యాపకుల నియామకం చేపట్టనున్న ప్రభుత్వం ● తమను ఆదుకోవాలని వేడుకోలు ● నిర్మల్ జిల్లాలో పనిచేస్తున్న 59 మంది అతిథి అధ్యాపకులు



ముథోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

ముథోల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని జిల్లాలోని ఆయా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లు (అతిథి అధ్యాపకులు) ఆరోపిస్తున్నారు. నిర్మల్ జిల్లాలోని 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారు 59 వరకు గెస్ట్ లెక్చరర్లు విధులను నిర్వహిస్తున్నారు. ఇందులో జిల్లాలో సుమారు 8 మంది 10 సంవత్సరాల నుంచి పనిచేస్తుండగా మిగతా వారు 2018 నుంచి విధులు నిర్వహిస్తున్నారు. అయితే ప్రభుత్వ అకాడమిక్ క్లియర్ పూర్తి కాకుండానే వారి స్థానంలో నూతన లెక్చరర్లను నియమించేందుకు చర్యలు చేపడుతుదని గెస్ట్ లెక్చరర్లు పేర్కొంటున్నారు. దీంతో తాము రోడ్డుపై పడే పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ లెక్చరర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కౌన్సిలింగ్ ప్రక్రియ ముగిసిందని, ఈ ప్రక్రియకు 1290 మంది జూనియర్ లెక్చరర్ అభ్యర్థులు ఎంపిక కాగా వారిలో 1286 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారని పేర్కొంటున్నారు. దీంతో నిర్మల్ జిల్లాలో 59 మంది గెస్ట్ లెక్చరర్లు విధులు నిర్వహించగా సుమారు 40 మంది గెస్ట్ లెక్చరర్లు విధులకు దూరం చేసే యోచనలో ప్రభుత్వం ఉందని దీంతో తమ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారనుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 1280 మంది నిడైరెక్టగా రిక్రూట్మెంట్ రెగ్యులర్ లెక్చరర్ కౌన్సెలింగ్ జరిగి అసాయింట్మెంట్ ఆర్డర్స్ త్వరలో ఇవ్వనున్న క్రమంలో వారి నియామకంతో సంబంధం లేకుండా తమని యథావిధిగా కొనసాగించాలని అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని అతిథి అధ్యాపకులు పేర్కొంటున్నారు. సుమారు పదేళ్ల నుంచి అతిథి అధ్యాపకు లుగా సేవలందిస్తూ విద్యార్థుల అడ్మిషన్ ప్రక్రియ నమోదు నుంచి అత్యుత్తమ రిజల్ట్ తీసుకురావడంలో రెగ్యులర్ లెక్చరర్లతో సమానంగా విధులు నిర్వహిస్తున్నామని పేర్కొంటున్నారు. పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును ఉంచుకొని చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నామని అంటున్నారు. వేతనాలు కూడా నెల నెల రాకుండా 3-4 నెలలకు ఒకసారి వస్తున్నప్పటికీ పని చేస్తున్నామని పేర్కొంటున్నారు. కళాశాలల అభ్యున్నతికి పాటుపడుతున్నామని పేర్కొంటున్నారు. అయితే ఇంటర్మీడియట్ వ్యవస్థలో ఉన్న కాంటాక్ట్, పార్ట్ టైం, ఎంటీఎస్ లెక్చరర్ల మాదిరిగానే కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో 'త్రీమెన్ కమిటీ' ఓపెన్ నోటిఫి కేషన్ ఇంటర్వ్యూ, డెమో, పీజీ మెరిట్ మార్కుల ఆధారంగా ఎంపికయ్యామని కానీ మాకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ప్రస్తుతం ఇంటర్ వ్యవస్థలో కేవలం అతిథి లెక్చరర్లకు మాత్రమే ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా అతి తక్కువ వేతనాలు తీసుకుంటూ పనిచేస్తున్నామని అంటున్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో సుమారు పదేళ్ల శ్రమ దోపిడీకి గురయ్యామని పేర్కొంటున్నారు. ఈ ప్రభుత్వమైనా మా శ్రమను మా సేవలను గుర్తించి రాష్ట్ర వ్యాప్తంగా 1286 మంది రెగ్యులర్ అధ్యాపకుల నియామకంతో సంబంధం లేకుండా మమ్మలను యథావిధిగా కొనసాగిస్తూ ఏ విధంగానైనా సేవాలను ఉపయోగించుకోవాలని వారు పేర్కొంటున్నారు. పది సంవత్సరాలు పనిచేస్తున్న మాకు అన్యాయం చేయ కుండా తమ కుటుంబ పరిస్థితులను దృష్టిలో ఉంచు కొని రోడ్డున పడకుండా చూడాలని చేతులెత్తి వేడు కుంటున్నామని ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ద్వారా డీఐవో పశుశురాంకు వివరణ కోరగా జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారు 59 మంది అతిథి అధ్యాపకులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం రెగ్యులర్ అధ్యాపకులను నియమిస్తే జిల్లాలో సుమారు 40 మంది అతిథి అధ్యాపకుల స్థానంలో రెగ్యులర్ అధ్యాపకులు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికి అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ఉన్న తాధికారులు, ప్రభుత్వం ఆదేశానుసారం ముందుకెళ్తాము.

మాకు అన్యాయం చేయొద్దు



● ఎం. సాయన్న (అతిథి అధ్యాపకుడు, 2152 సంఘం జిల్లా ఇన్‌చార్జి)

పదేళ్ల నుంచి చాలీచాలని వేతనాలతో కళాశాలలో పని చేస్తున్నాం. ఇప్పుడు ప్రభుత్వం మా స్థానంలో రెగ్యులర్ అధ్యాపకులను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో మాకు అన్యాయం జరుగుతుంది. ప్రభుత్వం మాపై దృష్టి సారించి మాకుటుంబ పరిస్థితులను పరిశీలించి, మాకు అన్యాయం చేయవద్దని వేడుకుంటున్నాను. మా సేవలను ఏ విధంగానైనా ఉపయోగించుకోవాలని కోరుతున్నాం. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలలో లైబ్రరీ ఇన్‌చార్జీలు, పీఈటీలుగా లైబ్రరీ అటెండర్లుగా లేదా టీచింగ్ లేదా నాన్ టీచింగ్ లేదా ఇంగ్లీష్ మీడియం అధ్యాపకులుగా ఇతర పోస్టుల్లో ఖాళీ ఉన్నాయి. పెద్ద మనసుతో మమ్ములను తొలగించకుండా మా సేవలను ఉపయోగించు కోవాలని చేతులెత్తి వేడుకుంటున్నాము. ఈ ప్రభుత్వంపై గంపెడు ఆశతో ఉన్నాము. మా కుటుంబం రోడ్డు పాలు కాకుండా చూడాలని వేడుకుంటున్నాం.

మా సేవలను వినియోగించుకోవాలి



● ఎస్. ముత్యం (అతిథి అధ్యాపకుడు, హిస్టరీ, నిర్మల్)

నేను పదేళ్ల నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిస్టరీ అతిథి అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్నాను. ప్రభుత్వం ఇప్పుడు నూతనంగా రెగ్యులర్ జూనియర్ అధ్యాపకులను నియమిస్తున్నప్పటికీ వాటితో సంబంధం లేకుండా మాకు తొలగించకుండా మా సేవలను వినియోగించుకోవాలని వేడుకుంటున్నాను. మేము చాలీచాలని వేతనంతో కళాశాలలో సక్రమంగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించే విధంగా కృషి చేస్తున్నాం. ప్రభుత్వం ఇదే వ్యవస్థలో మా సేవలను వినియోగించుకోవాలి.

ఉద్యోగ భద్రత కల్పించాలి



● ఉఫాకర్ ఖానం (అతిథి అధ్యాపకురాలు, జీవశాస్త్రం, భైంసా)

ప్రభుత్వం గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నాం. గత పది సంవత్సరాల నుంచి తక్కువ వేతనంతో రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా విధులు నిర్వహిస్తూ వచ్చిన వేతనంతో కుటుంబాన్ని పోషించు కుంటున్నాం. ప్రస్తుతం ప్రభుత్వం తమ స్థానంలో రెగ్యులర్ లెక్చరర్లను నియమించే యోచనలో ఉన్న దృష్ట్యా తమ కుటుంబ పోషణ భారంగా మారనుంది. అయితే 10 సంవత్సరాల నుంచి చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం మాకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాం.



దేవాపూర్ బ్రహ్మంగారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ నగేష్

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం

● కన్నుల పండువగా కల్యాణ మహోత్సవం ● పాల్గొన్న ఎంపీ నగేష్

తలమడుగు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం దేవాపూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ 6వ వార్షికోత్సవం, యజ్ఞం, కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలన్నారు. అదే విధంగా ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బోనగిరి స్వామి, స్టేట్ కౌన్సిల్ సభ్యులు గంగాధర్, రాజు, కనపర్తి చంద్రకాంత్, బీజేవైఎం అధ్యక్షులు దాతాజీ కిరణ్, మండల ఉపాధ్యక్షులు నక్క ధనుంజయ్, బోండ్ల వెంకటస్వామి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు శ్రీనివాస్, వామన్ పటేల్, శ్రీనివాసరెడ్డి, అశోక్, ఎక్స్ ఎంపిటిసి శానం శ్రీనివాస్, మహేందర్ యాదవ్, సామాన్ పెల్లి సంతోష్, రాజయ్య, శివాజీ పంతులు, తాటికొండ విఠల్, నాంపెల్లి శ్రీ రాములు, సామాన పెల్లి మోహన్, పోశోజి శ్రీను, పోశోజి నారాయణ, కొండాపూర్ సత్య నారాయణ, నాంపెల్లి సురేష్, మరుపాక రమేష్ తది తరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

ఉమ్మడి జిల్లాలో ఘనంగా జాతీయ సైన్స్ డే వేడుకలు



108 ఎలిమెంట్స్ చూడకుండా చెబుతున్న విద్యార్థిని సహస్ర



విద్యార్థుల ప్రదర్శనలు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు



ఇచ్చోడలో ప్రదర్శనలను పరిశీలిస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులు

ఖానాపూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఆయా పరికరాల చిత్రపటాలను గీసి ప్రదర్శించారు. 9వ తరగతికి చెందిన సహస్ర అనే విద్యార్థిని 108 మూలకాలను చూడకుండా చెప్పి అందరినీ ఆకట్టుకుంది. సోలార్ సిస్టంతో పాటు ప్లాంట్ సిస్టం తదితర అంశాలను విద్యార్థులు వివరించిన తీరు ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఉపాధ్యాయులు సుస్మితరాణి, స్రవంతి, తదితరులున్నారు.

సిద్దుల కుంట ఉన్నత పాఠశాలలో ..

సోన్: మండలంలోని సిద్దుల కుంట ఉన్నత పాఠశాలలో సైన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల ప్రయోగాలను ఉపాధ్యాయులకు తోటి విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయులు టి. నరేందర్ మాట్లాడుతూ సైన్స్ లేకుండా మనిషి మనుగడ సాగించలేడని నిత్య జీవితంలో సైన్ తప్పనిసరి అవసరని, ఏది గుడ్డిగా నమ్మకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హరీష్ రెడ్డి, ఉపాధ్యాయులు కడారి దశరథ్, చంద్రశేఖర్‌రావు, నరేందర్, భూమారెడ్డి, ముర్తుజాఖాన్ పాల్గొన్నారు.

కడ్తాల్ ఎంపీపీఎస్ పాఠశాలలో..

సోన్ మండలంలోని కడ్తాల్ ఎంపీపీఎస్ పాఠశాలలో జాతీయ వైజ్ఞానిక దినోత్సవం సందర్భంగా వైజ్ఞానిక మేళా, టీఎల్ఎం మేళాలు విద్యార్థులు ఉపాధ్యాయ సూచనలతో తాము స్వయంగా తయారు చేసిన వైజ్ఞానిక అంశాలను ప్రదర్శించారు. రాతియుగపు పనిముట్లు, కరెన్సీ, వివిధ జంతువుల నమూనాలు, కూరగాయల నమూనాలు, అక్షర మాస్కులు, తదితర ప్రదర్శనలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో పరమేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆర్. రమేష్ బాబు, ఉపాధ్యాయులు మంగమ్మ, విజయవాణి పాల్గొన్నారు.

నిత్య జీవితంలో సైన్స్ ఎంతగానో ఉపకరిస్తుంది

బోథ్: మనిషి నిత్యజీవితంలో సైన్స్ ఎంతగానో ఉపకరిస్తుందని అభివృద్ధికి సాంకేతిక పరిజ్ఞానం తోడు అవు తున్నదని సాంఘిక సం క్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత పేర్కొన్నారు. శుక్రవారం సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీవీ రామన్ చిత్రపటానికి పూల మాల లు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ లతా, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మాధవి, సీనియర్ లెక్చరర్ రవికుమార్, సైన్స్ ఉపాధ్యాయులు ఎల్. సంతోష్, శ్రీలేఖ, సృజన, శిరీష పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్‌ప్రయోగాలకు, ప్రదర్శనలను కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తిలకించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, వైస్ ప్రిన్సిపాల్ విజయ లక్ష్మి, భార్గవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఇచ్చోడ మండలంలోని కస్తూర్బా పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల, గోల్డెన్‌లీఫ్, తదితర ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు సైన్స్ క్విజ్, విజ్ఞాన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మల్లిక, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.



సోన్‌లో విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను పరిశీలిస్తున్న దృశ్యం



విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న దృశ్యం



శిశిరంలో కనువిందు చేస్తున్న చెట్టు


శిశిరంలో ఆకు రాలినా అందమే

● ప్రకృతి దిద్దిన చిత్రాలు

మాఘ, ఫాల్గుణ మాసాల్లో వచ్చే శిశిర రుతువు ప్రకృతిలో కొత్త అందాలను తీసుకువస్తుంది. ప్రస్తుతం ఓ వైపు ఆకులు రాలిపోతుంటే.. మరో వైపు కొత్త గురు పుట్టుకొస్తోంది. దూరం నుంచి ఏ చెట్టును చూసినా మోడు వారినట్లు కనిపిస్తుండగా, దగ్గరగా చూస్తే కొత్త చిరుగు దర్శనమిస్తోంది. మరి కొన్ని చెట్లు ఆకులు రాలిపోయి కాయలు మాత్రమే దర్శన మిస్తాయి. నిర్మల్ జిల్లా ముథోల్ ప్రాంతంలోని రోడ్ల వెంబడి ఈ దృశ్యాలు ప్రయాణికులకు కనువిందు చేస్తున్నాయి. పూర్తిగా ఆకులు రాలి పోయిన చెట్లు కేవలం పూలతో పులకరి స్తుంటే మరి కొన్ని చెట్లు రంగురంగుల పూలతో క నువిందు చేస్తున్నాయి.


● (ఆంధ్రజ్యోతి, ముథోల్)

ఫొటో న్యూస్









కొత్త ఠాణాలు





- జిల్లాలో ఐదు కొత్త పోలీసుస్టేషన్‌లకు ప్రతిపాదనలు
- రెండు ట్రాఫిక్, రెండు మహిళా పోలీసుస్టేషన్‌లు
- జిల్లా కేంద్రంలో సైబర్ క్రైం పోలీసుస్టేషన్
- సర్కారు పరిశీలనలో ప్రతిపాదనలు
- మోక్షం లభిస్తే నేరాల అదుపు, ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

నిర్మల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రోజు రోజుకు గ్రామాల నుంచి వచ్చి స్థిరనివాసం ఏర్పరుచుకుంటున్న వారి సంఖ్య జిల్లాకేంద్రంలో రెట్టింపు అవుతోంది. అలాగే వాహనాల సంఖ్య కూడా విపరీతంగా పెరిగిపోతుండడంతో ప్రస్తుతం నిర్మల్ పట్టణం పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. దీనికి అనుగుణంగా శివారు కాలనీలు విస్తరించడం, గ్రామాల్లో సైతం జనాభా పెరిగిపోతున్న కారణంగా శాంతిభద్రతల సమస్యతో పాటు ట్రాఫిక్ సమస్య పోలీసుశాఖకు సవాలుగా మారుతోంది. ముఖ్యంగా నిర్మల్, భైంసాల్లో అదనంగా పోలీసుస్టేషన్‌లు ఏర్పాటు చేయాలంటూ గత పదిహేను సంవత్సరాల నుంచి జిల్లా పోలీసు అధికారులు సర్కారుకు ప్రతిపాదనలు పంపుతున్నప్పటికీ ఆ ప్రతిపాదనలకు మోక్షం లభించడం లేదు. నిర్మల్, భైంసాల్లో ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లతో పాటు ప్రత్యేకంగా మహిళా పోలీసుస్టేషన్‌లను అలాగే సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ఇక్కడి పోలీసు అధికారులు సర్కారుకు నివేదించారు. గతంలో జిల్లా కేంద్రమైన నిర్మల్‌లో ట్రాఫిక్, మహిళ పోలీసుస్టేషన్‌లను ఏర్పాటు చేస్తామంటూ కూడా అప్పటి సీఎం కేసీఆర్ ఇక్కడి నేతలకు హామీనిచ్చారు. అయితే ఇప్పటి వరకు ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. అలాగే శాంతి భద్రతల సమస్య, ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు పెరిగిపోయి ప్రస్తుతం ఉన్న పోలీసుస్టేషన్‌లకు భారంగా మారుతోంది. దీంతో పోలీసుస్టేషన్‌లలో ఉన్న అధికారులు, సిబ్బంది పనిభారంతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో కొత్త పోలీసుస్టేషన్‌లను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతుండడం ఇక్కడి పోలీసు వర్గాల్లో ఆశలు రేకెత్తిస్తోంది. ఇప్పటికే తమ ప్రతిపాదనలను సర్కారుకు నివేదించామని ఆ ప్రతిపాదనలకే ఆమోదం తెలిపి కొత్తగా పోలీసుస్టేషన్‌లను మంజూరు చేయాలని కోరుతున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం అవసరాల రీత్యానే పోలీసుస్టేషన్‌లను ఏర్పాటు చేయాలని భావిస్తోంది.

అష్టదిగ్బంధంలో పోలీసులు

జిల్లాకేంద్రంగా నిర్మల్ కొనసాగుతుండడం, సున్నిత ప్రాంతంగా భైంసా సబ్ డివిజన్ ప్రాంతం గుర్తించడము పోలీసు అధికారుల పనితీరుపై ప్రభావం చూపుతోందంటున్నారు. జిల్లాకేంద్రంలో ప్రతీరోజూ ప్రొటోకాల్ వ్యవహారం పోలీసులకు తలకు మించిన భారవమవుతోంది. అలాగే మహిళలకు సంబంధించిన నేరాలు పెరిగిపోవడం, కుటుంబ తగాదాలు, భార్యభర్తల తగాదాలు లాంటి కేసులతో పాటు మహిళలపై నేరాలు సైతం పెరిగిపోతున్న సంఘటనలు వెలుగుచూస్తున్నాయి. మహిళల జనాభా పెరిగిపోతుండడం, వారికి సంబంధించిన కేసులు రెట్టింపు కావడంతో నిర్మల్‌లో ఓ ప్రత్యేక మహిళ పోలీసుస్టేషన్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. దీంతో పాటు భైంసాలో కూడా మహిళలకు సంబంధించిన కేసులు పెరిగిపోతున్నాయి. ఈ రెండు ప్రాంతాల్లో మహిళ పోలీసుస్టేషన్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందంటూ పోలీసు ఉన్నతాధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. అలాగే నిర్మల్ పట్టణంతో పాటు భైంసా పట్టణంలో కూడా ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చుతోంది. ట్రాఫిక్ సమస్యను నివారించడం పోలీసులకు తలకు మించిన భారంగా మారింది. నిర్మల్ పట్టణంలో ఇటు జన సామర్థ్యం అటు వాహనాల రాకపోకలతో పట్టణమంతా ప్రతీరోజూ కిటకిటలాడుతుంటోంది. ముఖ్యంగా మంచిర్యాల చౌరస్తా, శాంతినగర్ చౌరస్తా, ఈద్గాం చౌరస్తా, మార్కెట్ ప్రాంతం, చింతకుంటవాడ, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, రూరల్ పోలీస్ స్టేషన్, వివేకానంద చౌక్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ప్రతీరోజూ ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ట్రాఫిక్ డ్యూటీలను చేసేందుకు పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అయితే సాధారణ పోలీసుల చేతనే ట్రాఫిక్ డ్యూటీలు చేయిస్తూ ఉన్నతాధికారులు చేతులు దులుపుకుంటున్నారన్న వాదనలున్నాయి. అలాగే భైంసాలో కూడా ఇదే తరహా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఈ రెండు ప్రాంతాలకు ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లను మంజూరు చేయాలంటూ గత కొన్ని సంవత్సరాల నుంచి స్థానికులు అలాగే పోలీసులు సైతం డిమాండ్ చేస్తున్నారు. రోజు రోజుకు సమస్య తీవ్రమవుతున్నప్పటికీ ఈ డిమాండ్ మాత్రం కార్యరూపం దాల్చలేదు.

సైబర్ క్రైంకు విరుగుడు

కాగా జిల్లాలో గత కొంతకాలం నుంచి సైబర్ క్రైం రేటు విపరీతంగా పెరిగిపోతోంది. రకరకాల ఆన్‌లైన్ మోసాలతో ప్రజలు లక్షల రూపాయల్లో నష్టపోతుండడమే కాకుండా అమాయకులు బలి పశువులు అవుతున్నారు. సైబర్ క్రిమినల్ రోజుకో కొత్త రీతిన సైబర్ క్రైంకు పాల్పడుతూ జనాలకు శఠగోపం పెడుతున్నారు. అయితే సైబర్ క్రైం పరిశోధనతో పాటు ఆ కేసుల ఛేదన అలాగే సాంకేతిక నైపుణ్యం లాంటి అంశాలు సాధారణ పోలీసుశాఖను ఇబ్బందుల పాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ఏర్పాటైతే సాంకేతిక నిపుణులంతా అందుబాటులోకి రానున్నారు. దీని కారణంగా సైబర్ క్రైంను నిరోధించే అవకాశాలు ఏర్పడనున్నాయని అంటున్నారు. అయితే జిల్లా పోలీసు అధికారులు రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఏ మేరకు సుముఖత వ్యక్తం చేస్తుందోననే అంశంమే ఆసక్తికరంగా మారుబోతోందని అంటున్నారు.



ఆర్థిక అక్షరాస్యత

వారోత్సవాల సందర్భంగా 2కే రన్ ర్యాలీ

- ర్యాలీని ప్రారంభించిన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి ఎన్టీఆర్ మినీస్టేడియం వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ 2కే రన్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ జెండా ఊపి ప్రారంభించారు. మహిళల్లో ఆర్థిక అక్షరాస్యత పెంపొందించే విధంగా అవగాహన కల్పించేలా నినాదాలు చేస్తూ ఈ 2కే రన్ ర్యాలీ ఎన్‌టీఆర్ స్టేడియం వరకు కొనసాగింది. అనంతరం స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు జిల్లాలో ఆర్‌బీఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశ్యం బ్యాంకుల ద్వారా మహిళలను అన్ని రంగాల్లో పరిపుష్టం చేయడమేనన్నారు. మహిళా సాధికారతకు బ్యాంకులు అనేక రకాలుగా చేయూతను అందిస్తున్నాయని తెలిపారు. ఆయా పథకాలకు, రుణాలకు అర్హులైన మహిళలందరూ వాటిని సద్వినియోగపరచుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. మహిళలకు సంబంధించి ఆర్థిక అంశాలతో ముడిపడి ఉన్న అన్ని రకాల పథకాలపై అధికారులు మహిళలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. స్వయం సంఘాలకు చేయూతనివ్వడానికి ఎన్నో రకాల పథకాలు ఉన్నాయని, మహిళా సాధికారత సాధించడానికి ఈ పథకాలు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. మహిళలకు పొదుపుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బ్యాంకుల సహకారంతో మహిళలు వాణిజ్య, వ్యాపార రంగాల్లో రాణించగలుగుతున్నారని తెలిపారు. వివిధ వర్గాల మహిళలు, ట్రాన్స్‌జెండర్లు బ్యాంకు ఖాతాలు కలిగి ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, జడ్పీ సీఈవో గోవింద్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, మెప్మా పీడీ సుభాష్, వెనుకబడిన తరగతుల అధికారి రాజేశ్వర్ గౌడ్, సీడీపీవో నాగలక్ష్మి, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ అశోక్‌కుమార్, ఎస్‌హెచ్‌జీల మహిళలు, బ్యాంకర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వసతిగృహాల్లో చదివే విద్యార్థులందరికీ నాణ్యమైన చదువుతో పాటు మెరుగైన వసతులను కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి నిర్మల్ పట్టణంలోని నటరాజ్ నగర్ ప్రభుత్వ వెనకబడిన కులాల బాలుర కళాశాల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, విద్యార్థుల వసతి గృహాలు, వంట గది, స్టోర్ రూమ్, మరుగుదొడ్లు, రీడింగ్ రూమ్ అదనపు కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహ నిర్వహణకు సంబంధించి అన్ని రకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులందరికీ స్వయంగా భోజనాన్ని వడ్డించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి బాగోగులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన కులాల అధికారి వి.రాజేశ్వర్‌గౌడ్, ఎస్‌డబ్ల్యూవో డి.లత, ఎస్‌డబ్ల్యూవో ఎన్.శ్రీనివాస్‌రెడ్డి, ఇతర అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య



ఘటనాస్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్సై రాహుల్

ఖానాపూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల నేపథ్యంలో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బీర్నంది గ్రామ పంచాయతీ పరిధిలోని రాజీవ్ తండాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన కథనం ప్రకారం... బీర్నంది గ్రామ పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్ తండాకు చెందిన బాణావత్ వెంకటేష్(27) అనే వ్యక్తికి అదే గ్రామానికి చెందిన మీనాక్షి అనే మహిళతో 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు జన్మించారు. గత కొంతకాలంగా మద్యానికి బానిసైన వెంకటేష్ భార్యపై అనుమానంతో ఆమెతో, తన కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడేవాడు. గురువారం సైతం అదే గ్రామంలోని తన అత్తగారింటి వద్ద భార్యతో జరిగిన గొడవతో బీర్ బాటిల్‌తో తలపై కొట్టుకున్నాడు. దీంతో వెంకటేష్ తలపై స్వల్ప గాయం అయ్యింది. అక్కడి నుండి ఇంటికి వచ్చిన వెంకటేష్ తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న వెంకటేష్ రాత్రి ఇంట్లో ఉన్న దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం ఎంతకు వెంకటేష్ బయటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కిటకీలోంచి చూడగా దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలాన్ని ఎస్సై రాహుల్ పరిశీలించారు. ఈ మేరకు అతని తండ్రి లచ్చు నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. లచ్చునాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ తెలిపారు.

సుద్దవాగులో పడి

మేకల కాపరి మృతి



కాసర్ల భూమన్న (ఫైల్)

భైంసా రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కామోల్ గ్రామానికి చెందిన కాసర్ల భూమన్న(54) సుద్ద వాగులో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కామోల్ గ్రామానికి చెందిన కాసర్ల భూమన్న ఉదయం మేకల మేతకు సుద్దవాగు వైపు వెళ్లగా ప్రమాదవశాత్తు ఒక మేక సుద్దవాగులో పడడంతో దాన్ని కాపాడబోయి ప్రమాదశాత్తు తాను పడి మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఏఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సచివాలయం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల రిజిస్ట్రేషన్ అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ... జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. పరీక్ష విధులు నిర్వహించే అధికారులందరికీ శిక్షణ కల్పించాలన్నారు. జిల్లాల వారీగా ఇంటర్మీడియట్ పరీక్షలు రాయబోతున్న విద్యార్థుల సంఖ్య, పరీక్షా కేంద్రాల సంఖ్య, పరీక్షల నిర్వహణలో పాల్గొనబోయే సిబ్బంది, తదితర వివరాలను కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలను అత్యవసర మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. పరీక్షల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అన్ని సందర్భాల్లో పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని అన్ని జిల్లాల ఎస్పీలను సీఎస్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ దుకాణాలను మూసి వేసి, 144 సెక్షన్‌ను అమలు పరచాలన్నారు. అలాగే ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం నూతన నిర్ణయాలు తీసుకుందన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల రిజిస్ట్రేషన్ రుసుములో 25 శాతం రాయితీని కల్పించినట్లు తెలిపారు. మార్చి 31 వరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ గడువు ముగుస్తుందని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారుల సమీక్షిస్తూ, జిల్లాలో ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలలో కలుపుకొని 23 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాల్లో 6,571 మంది ప్రథమ సంవత్సరం, 6,562 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు మొత్తం కలిపి 13,133 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నట్లు తెలిపారు. మార్చి 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎల్ఆర్ఎస్ దరఖాస్తు రిజిస్ట్రేషన్ల అంశంపై కలెక్టర్ మాట్లాడుతూ... ఎల్ఆర్ఎస్ (లే అవుట్ల క్రమబద్ధీకరణ) దరఖాస్తు దారులంతా క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారుల రిజిస్ట్రేషన్ రుసుములో 25 శాతం రాయితీ కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులంతా రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించాలని తెలిపారు. మార్చి 31వ తేదీతో లే అవుట్ల దరఖాస్తుల రుసుము చెల్లించే గడువు ముగుస్తుందన్నారు. గడువు ముగిసిన తర్వాత మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం ఉండదని, కావునా దరఖాస్తుదారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన రుసుములు చెల్లించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఎస్పీ జానకి షర్మిల, అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరుశురాం, డీఈవో పి. రామారావు, డీపీవో శ్రీనివాస్, డీఎం ఆర్టీసీ ప్రతిమా రెడ్డి, డీఎంహెచ్‌వో రాజేందర్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్‌గౌడ్, జాదవ్ కృష్ణ, రాజేష్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని

జిల్లాలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్ పక్కన ఎస్పీ



సమావేశానికి హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జిల్లాలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. ముస్లిం సోదరులు ఉపవాసం ఉండే సమయాల్లో వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రంజాన్ మాసంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, ముస్లిం మత పెద్దలతో ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మార్చి 2 నుంచి రంజాన్ మాసం ఉపవాసాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మసీదుల దగ్గర నిరంతరం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని, మసీదుల పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలని సూచించారు. ప్రార్థన సమయాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని, ప్రార్థన సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దుకాణ సముదాయాలను అదనపు సమయాల్లో తెరిచి ఉండే విధంగా అనుమతించడం జరుగుతుందన్నారు. ముస్లింల సహాయార్థం టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రంజాన్ మాసంలో ముస్లింలకు ఏవైనా సమస్యలు ఎదురైతే అధికారులు త్వరితగతిన స్పందించి, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. రంజాన్ పండుగనాడు అన్ని ఈద్గాలలో ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈద్గాలలో త్రాగునీరు, షామియానాలు, ఇతర ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. ఈద్గా పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని, అన్ని మతాల పండుగలను సహోదర భావంతో జరుపుకోవాలని కలెక్టర్ కోరారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ... రంజాన్ మాసంలో ముస్లింలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మసీదుల వద్ద ప్రార్థన సమయాల్లో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా దుకాణాలను అదనపు సమయాల్లో తెరిచి ఉంచేందుకు అనుమతులు ఇస్తామన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, ముస్లిం మత పెద్దలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 33/11 కేవీ అక్కాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9:30 నుండి 11:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు. ఈ మేరకు సబ్‌స్టేషన్ పరిధిలోని కొండాపూర్, అక్కాపూర్, సెయింట్ థామస్ స్కూల్, న్యూ పోచంపాడ్, అర్లి(బి), రత్నాపూర్ కాండ్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కావునా వినియోగదారులు సహకరించాలని కోరారు.

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జిని కలిసిన డీసీసీ



టీపీసీసీ ఇన్‌చార్జికి అభివాదం చేస్తున్న శ్రీహరిరావు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా నూతనంగా నియమితులైన మీనాక్షి నటరాజన్‌ను శుక్రవారం నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న టీపీసీసీ సమావేశానికి ఆమె ఇన్‌చార్జి హోదాలో మొదటిసారి హాజరయ్యారు.

నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌ను

ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ



నర్సాపూర్(జి), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌ను నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది నిర్వహిస్తున్న విధులను ఎస్సై సాయికిరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని ప్రజలకు కలిగించాలని పోలీస్ స్టేషన్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాలు, సిబ్బంది పని తీరును పరిశీలించడంతో పాటు పెండింగ్‌లో తీవ్రమైన నేరాల సీడీ ఫైల్స్, స్థిరాస్తి చోరీలు, ఐటీ కేసుల ప్రస్తుత స్థితిగతులపై రికార్డులను తనిఖీ చేశారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలో గల నేర ప్రవృత్తి గల వారిని ప్రతిరోజు తనిఖీ చేయాలని, అలాగే ఆస్తి నేరాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టాలని, పోలీస్ స్టేషన్ల పరిధిలో తిరిగే అనుమానితుల సమాచారాన్ని సేకరించాలన్నారు. సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. అలాగే ప్రజలు వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, తాగి వాహనాలు నడపవద్దన్నారు. డయల్ 100కు కాల్ వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ స్టేషన్ అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్, నిర్మల్ గ్రామీణ సీఐ కృష్ణ, నర్సాపూర్ పోలీసుస్టేషన్ ఎస్సై సాయికిరణ్, పోలీసుస్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.